జాతీయ వార్తను ఈ-పేపర్‌లోనూ, డబ్ల్యుడబ్ల్యుడబ్ల్యు.జాతీయవార్త.కామ్‌లో కూడా వీక్షించవచ్చు.

epaper:jatheeyavaartha.com

www.jatheeyavaartha.com

# జాతీయ వార్త

తెలుగు దిన పత్రిక



చదవండి.. చదివించండి..

జాతీయ వార్త తెలుగు దినపత్రిక

మా పత్రిక అభివృద్ధికి పాఠకులు, శ్రేయోభిలాషులు, మిత్రులు, అధికారులు సహకరించాలని మనవి. మీమీ మండలాల్లో ఏమైనా సమస్యలు ఉన్నాయా.. ఎవరైనా ఇబ్బందులు పెడుతున్నారా.. అయితే వాటిని మా దృష్టికి తీసుకురండి.. వాటిని జాతీయ వార్త తెలుగు దిన పత్రికలో ప్రచురిస్తాం. మీ సమస్యలను రాజకీయ నాయకులు, అధికారుల దృష్టికి తీసుకువెళతాం - ఎడిటర్, ఫోన్: 9963063761

epaper:jatheeyavaartha.com www.jatheeyavaartha.com



ఆదివారం | 24-5-2026 | శ్రీకాకుళం | సంపుటి: 3 సంచిక: 681 పేజీలు: 4 వెల: రూ.7




- అస్తవ్యస్తంగా ఉన్న సరుబుజ్జిలిలోని కాంప్లెక్స్ -చెత్త..ముళ్ల పొదలమయంతో లోపలికి రాని బస్సులు
-ప్రయాణికులకు తప్పని అవస్థలు -నిమ్మకు నీరెత్తినట్టు వ్యవహరిస్తున్న అధికారులు

# ఆర్టీ చీ బస్టాండ్



**(సరుబుజ్జిలి)**

సరుబుజ్జిలిలోని ఆర్టీసీ కాంప్లెక్స్..ఆర్టీసీ అధికారులు, యంత్రాంగం నిర్లక్ష్యంతో అధ్వానంగా తయారైంది. బస్టాండ్ ముందుభాగంలో చెత్తా..చెదారం పెరిగి అది కనిపించకుండాపోతోంది. దీంతో కొన్ని బస్సులు లోపలికి రాకుండానే వెళ్లిపోతున్నాయి. కొంతకాలంగా విద్యుత్ సరఫరా నిలిచిపోవడంతో బస్టాండ్ అంధకారంలో మగ్గుతోంది. కుర్చీలు, గదులు ధ్వంసమయ్యాయి. టాయిలెట్లు కూడా ధ్వంసమై.. దుర్గంధం వ్యాపిస్తుండడంతో మహిళా ప్రయాణికులు, ఉద్యోగుల అవస్థలు వర్ణనాతీతం. అదీగాక ఈ బస్టాండ్ బిచ్చగాళ్లు, మేకలు, విష సర్పాల సంచారానికి నిలయంగా మారింది. దీంతో ప్రయాణికులు రోడ్లపైనే నిలబడాల్సి వస్తోంది. అధికారులకు పరిస్థితి తెలిసినా పట్టించుకోవడం లేదని స్థానికులు ఆరోపిస్తు న్నారు. ఈ కాంప్లెక్స్‌లోని షాపుల్లో గిరాకీ లేక అద్దెలు ఎలా కట్టాలో తెలియక షాప్ యజమానులు ఇబ్బంది పడుతున్నారు. కానీ అధికారులు మాత్రం తమకు ఆదాయం వస్తే చాలు అన్నట్టుగా వ్యవహరిస్తున్నారని ప్రయాణికులు ఆరోపిస్తున్నారు.

# బీడు రోడ్డుకు మహర్దశ

-డబుల్ తారు రోడ్డుతో మారిన ఉద్దానం ముఖచిత్రం
- పలాస ఎమ్మెల్యే గౌతు శిరీష సంకల్పానికి సర్వత్రా ప్రశంసలు
-ప్రాణాలకు, ఆటోలకు రక్షణ దొరికింది
- ఆటో కార్మికుల ఆనంద హేల




**పలాస, మే 23 (వార్త):** ఉద్దాన ప్రాంత ప్రజల దశాబ్దాల కల నెరవేరింది. వజ్రపుకొత్తూరు మండలంలో గుంతలమయంగా మారిన రహదారికి కూటమి హయాంలో మోక్షం లభించింది. తాళభద్ర మీదుగా



గరుడుభద్ర, అక్కుపల్లి, బైపల్లి, బాతుపురం, చినవంక, డోకులపాడు మీదుగా వజ్రపుకొత్తూరు వరకు నిర్మించిన సరికొత్త డబుల్ తారు రోడ్డు నేడు ఉద్దాన నేలతల్లికి మువ్వల సవ్వడిలా మెరిసిపోతోంది. పలాస ఎమ్మెల్యే గౌతు శిరీష ప్రత్యేక సంకల్పంతో ఈ రహదారి నిర్మాణాన్ని పూర్తి చేయించడంతో స్థానిక ప్రజలు, ముఖ్యంగా ఆటో కార్మికులు హర్షాతిరేకాలు వ్యక్తం చేస్తున్నారు.

### ఆనాడు నరకం.. ఈనాడు నందనవనం!

గతంలో ఈ ప్రాంతంలో ప్రయాణించాలంటేనే వాహనదారులు, గర్భిణులు, రోగులు భయపడిపోయేవారు. కంకర రాళ్లు తేలి, పెద్ద పెద్ద గుంతలతో రోడ్డు అధ్వానంగా ఉండేది. "ఆనాడు కంకర రాళ్లతో, గుంతల రోడ్ల వల్ల మా ప్రాణాలకు, మా నమ్ముకున్న ఆటోలకు అస్సలు రక్షణ లేకుండా పోయింది. నిత్యం ప్రమాదాల భయంతో బతికాం. కానీ ఈనాడు కూటమి ప్రభుత్వంలో గౌతు శిరీష చొరవతో రోడ్డు అద్దంలా మారింది. ఇప్పుడు మా ప్రయాణం ప్రశాంతంగా, సురక్షితంగా సాగుతోంది" అని ఉద్దానం ఆటోవాలాలు ఆనందం వ్యక్తం చేశారు.

### హోరెత్తిన నినాదాలు:

'ఉద్దాన ఆడపడుచా.. నీకు మరువదు ఈ ఉద్దాన తల్లి'.. రహదారి నిర్మాణాన్ని పూర్తి చేసి తమ కష్టాలు తీర్చిన ఎమ్మెల్యే గౌతు శిరీషకు అభినందనలు తెలుపుతూ శనివారం ఉద్దాన ఆటో కార్మికులు పెద్ద ఎత్తున ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా వారు ఒక ప్రత్యేక నినాదంతో హోరెత్తించారు. "ఉద్దాన ఆడపడుచా... నీ గుణం మరువదు ఈ ఉద్దాన తల్లి!" "అభివృద్ధి ప్రదాత గౌతు శిరీష నాయకత్వం వర్ధిల్లాలి!" ఈ డబుల్ తారు రోడ్డుతో వజ్రపుకొత్తూరు మండలంలోని పదుల సంఖ్యలో ఉన్న గ్రామాలకు రవాణా సౌకర్యం మెరుగుపడటమే కాకుండా, ఉద్దాన ప్రాంత జీడి, కొబ్బరి పంటల రవాణాకు కూడా ఎంతో మేలు చేకూరనుంది. ఒక ఆడపడుచుగా ఉద్దాన ప్రజల కష్టాలను గుర్తించి, ఈ బృహత్తర కార్యాన్ని విజయవంతంగా పూర్తి చేసిన శిరీషపై సర్వత్రా ప్రశంసల జల్లు కురుస్తోంది.

# అండమాన్ తెలుగు సంఘానికి చంద్రబాబు భరోసా



**సోంపేట, మే 23(వార్త):** అండమాన్‌లో పెద్ద సంఖ్యలో నివాసముంటున్న తెలుగు ప్రజల సంక్షేమానికి, వారి అభివృద్ధికి తమదైన రీతిలో ఆదుకుంటామని ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు భరోసా ఇచ్చారు. విజయనగరం పార్లమెంట్ సభ్యుడు కలిశెట్టి అప్పలనాయుడుతో కలిసి అండమాన్ నికోబార్ ఐలాండ్స్ జాయింట్ యాక్షన్ తెలుగు కమ్యూనిటీ ప్రధాన కార్యదర్శి బైపల్లి రామరాజు, టీడీపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సూరాడ చంద్రమోహన్ తదితరులు శనివారం అమరావతిలో చంద్రబాబును కలిసి అనేక అంశాలను ప్రస్తావించారు. విశాఖపట్నంలో అండమాన్ భవనానికి సరైన వసతులు లేనందున కొత్త భవనం నిర్మాణానికి స్థలం కేటాయించాలని కోరారు. అండమాన్ నుంచి నేరుగా విశాఖపట్నంకి విమానాలు నడపాలని కోరారు. అండమాన్‌లో నివసిస్తున్న తెలుగు కులాలను ఓబీసీలుగా గుర్తించి ధ్రువపత్రాలు మంజూరు చేయాలని కోరారు. సోంపేట మండల టీడీపీ అధ్యక్షుడు మధు కుమార్, బడే తమ్మారావు, అండమాన్ టీడీపీ ప్రతినిధి వంక మోహన్‌రావు, దుమ్ము అశోక్ తదితరులు పాల్గొన్నారు. ఈ వినతులపై చంద్రబాబు స్పందిస్తూ వీలైనంత త్వరలో తప్పకుండా ఈ సమస్యలు పరిష్కరిస్తానని హామీ ఇచ్చారు. దీంతో ముఖ్యమంత్రి చంద్రబాబుకు ఈ బృందం సభ్యులు కృతజ్ఞతలు తెలిపారు.

జాతీయ
వార్త
తెలుగు దిన పత్రిక
శ్రీకాకుళం



# లింబుగాంలో అడ్మిషన్ డ్రైవ్

**మందస, మే 23(వార్త):** లింబుగాంలో మందస మండల విద్యాశాఖాధికారి-2 ఎం.భాస్కరరావు ఆధ్వర్యంలో అడ్మిషన్ డ్రైవ్ నిర్వహించారు. మందస మండలంలోని ఉద్దాన ప్రాంతమైన లింబుగాంలో మండల పరిషత్ ప్రాథమిక పాఠశాల ఉపాధ్యాయులు డ్రైవ్ పాల్గొని, తల్లిదండ్రులు తమ పిల్లలను ప్రభుత్వ పాఠశాలలో చేర్పించాలని కోరారు. పాఠశాలలో విద్యార్థుల చేరికలో గ్రామపెద్దలు ఎంతో సహాయ సహకారాలు అందించారు. అడ్మిషన్ డ్రైవ్‌కు సహరిస్తున్న అందరికీ పాఠశాల తరఫున కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయుడు మార్పు జగన్మోహనరావు, ఉపాధ్యాయులు గున్న రాజు, సీఆర్ఎంటీ లక్ష్మీనారాయణ, గ్రామ పెద్దలు పాల్గొన్నారు.





## బొంగి వెంకయ్య కుటుంబానికి ..
# బల్ల గిరిబాబు పరామర్శ

**మందస, మే 23(వార్త):** బాలిగాం గ్రామానికి చెందిన మాజీ ఎంపీటీసీ సభ్యుడు బొంగి వెంకయ్య కుటుంబాన్ని పలాస-కాశీబుగ్గ మున్సిపాలిటీ మాజీ ఛైర్మన్ బల్ల గిరిబాబు శనివారం పరామర్శించారు. కాళింగ కుల పెద్దగా.. రాజకీయ నాయకునిగా.. సోషల్ వర్కర్ గా పని చేసిన వెంకయ్య శుక్రవారం ఆకస్మికంగా మరణించారు. ఈ విషయం తెలుసుకున్న గిరిబాబు వెంకయ్య కుటుంబాన్ని పరామర్శించారు. ఆయన ఆత్మకు శాంతి చేకూరాలని, ఆ కుటుంబానికి తన ప్రగాఢ సానుభూతిని తెలిపారు. కార్యక్రమంలో విద్యావాహిని స్కూల్ మేనేజింగ్ డైరెక్టర్ పైల తిరుమలరావు, పెద్దలు వల్లభ వైకుంఠరావు, పైడి ప్రభాకరరావు, బాలిగాం గ్రామ పెద్దలు పాల్గొన్నారు.



# శ్రీధర్ సభ్యతతో మాట్లాడు..!

## -పీఏసీఎస్ ఛైర్మన్లు

**పలాస, మే 23 (వార్త):** పీఏసీఎస్ మాజీ ఛైర్మన్ దువ్వాడ శ్రీధర్ ఇటీవల చేసిన వ్యాఖ్యల నేపథ్యంలో వివిధ పీఏసీఎస్ ఛైర్మన్లు సంయుక్తంగా స్పందిస్తూ తమ అభిప్రాయాలను వెల్లడించారు. ముఖ్యంగా పలాస ఎమ్మెల్యే గౌతు శిరీష ప్రస్తావించిన పీఏసీఎస్ వ్యవహారాలు, అభివృద్ధి కార్యక్రమాలు, స్థానికత అంశా లపై వచ్చిన విమర్శలను వారు ఖండించారు. మందస పీఏసీఎస్ ఛైర్మన్ తమిరియా భాస్కర్ మాట్లాడుతూ గతంలో పలాస పీఏసీఎస్ లో జరిగిన విధుల దుర్వినియోగంపై ఎమ్మెల్యే మాట్లాడిన అంశాన్ని తప్పుదోవ పట్టించే ప్రయత్నం జరుగుతోందన్నారు. ఎవరిపైనా వ్యక్తిగత ఆరోపణలు చేయకుండా వ్యవస్థలో జరిగిన అంశాలపై మాత్రమే స్పందించారని తెలిపారు. మద్యం ధరలు, వ్యాపారాలకు ఎమ్మెల్యే కుటుంబాన్ని అనుసంధానం చేయడం ఆధారరహితమని పేర్కొన్నారు. గత ప్రభుత్వ కాలంతో పోలిస్తే ప్రస్తుతం ప్రజలు ప్రశాంత వాతావరణంలో జీవిస్తున్నారని, ప్రజాస్వామ్యబద్ధమైన పాలన కొనసాగుతోందని అన్నారు. స్థానికత పేరుతో రాజకీయ విమర్శలు చేయడం సరికాదని, ప్రజాస్వామ్యంలో ప్రజలే తుది నిర్ణేతలని పేర్కొన్నారు. వజ్రపుకొత్తూరు పిఏసిఎస్ ఛైర్మన్ కణితి సురేష్ చౌదరి మాట్లాడుతూ పలాస పిఏసిఎస్ లో 2005 నుండి 2024 వరకు జరిగిన వ్యవహారాలపై విచారణ కోరిన నేపథ్యంలో కొందరు రాజకీయ కోణంలో స్పందిస్తున్నారని అన్నారు. విచారణ జరిగి వాస్తవాలు బయటకు వస్తే అందరూ అంగీకరించాలని పేర్కొన్నారు. గత ప్రభుత్వ కాలంలో జరిగిన అంశాలను ప్రస్తుత ప్రభుత్వంపై మళ్లించే ప్రయత్నం తగదన్నారు. మువ్వల నాగేష్ ఘటన వంటి అంశాలపై గత పాలకులు కూడా సమాధానం చెప్పాల్సిన అవసరం ఉందన్నారు. అభివృద్ధి విషయానికి వస్తే నియోజకవర్గంలో కోట్ల రూపాయల విలువైన ప్రాజెక్టులు, విద్య, సాగునీరు, రవాణా రంగాల్లో పనులు ముందుకు వెళ్తున్నాయని తెలిపారు. స్థానికతపై విమర్శలు రాజకీయ ప్రయోజనాల కోసమే చేస్తున్నారని పేర్కొన్నారు. గౌతు కుటుంబంపై వస్తున్న ఆరోపణలను ఖండిస్తూ, ఆ కుటుంబం దశాబ్దాలుగా ప్రజల్లో విశ్వాసాన్ని సంపాదించుకుందని, ప్రజాభిమానం వల్లే ఎన్నికల్లో మద్దతు లభిస్తోందని అన్నారు. ప్రజలను తప్పుదోవ పట్టించే వ్యాఖ్యల కంటే అభివృద్ధిపై చర్చ జరగాలని సూచించారు. బాలిగాం పిఏసిఎస్ ఛైర్మన్ లబ్బ రుద్రయ్య మాట్లాడుతూ వ్యక్తిగత విమర్శలతో రాజకీయ ప్రయోజనం పొందాలని ప్రయత్నించడం సరికాదన్నారు. పలాస నియోజకవర్గానికి నిధులు తీసుకువచ్చి అభివృద్ధి కార్యక్రమాలు అమలు చేస్తున్న నాయకత్వంపై అసత్య ప్రచారం చేయడం తగదని పేర్కొన్నారు. పీఏసీఎస్‌లో అవకతవకలు జరిగాయా లేదా?.. అన్నది అధికారిక విచారణ ద్వారా బయటకు వస్తుందని, ముందుగానే ఉలిక్కిపడి ఆరోపణలు చేయడం సరికాదన్నారు. ప్రస్తుతం ప్రజల్లో ప్రశాంత వాతావరణం ఉందని, అభివృద్ధి పనులే ప్రభుత్వ పనితీరుకు నిదర్శనమని తెలిపారు. పలాస పీఏసీఎస్ ఛైర్మన్ వంకల కుర్మారావు మాట్లాడుతూ పీఏసీఎస్ అంశాలపై మాట్లాడిన వెంటనే కొందరు ఎందుకు ఆందోళన చెందుతున్నారో ప్రజలు గమనిస్తున్నారని అన్నారు. ఎంక్వైరీ పూర్తయ్యాక నిజాలు బయటకు వస్తాయని చెప్పారు. రెండు సంవత్సరాల్లో నియోజకవర్గంలో జరిగిన అభివృద్ధిని ప్రజలే చూస్తున్నారని తెలిపారు. ప్రజా సేవ ముఖ్యం గతం నుండి ఇప్పటివరకు జరిగిన కార్యకలాపాలపై ఆడిట్, విచారణ ప్రకారం వాస్తవాలు వెల్లడిస్తామని తెలిపారు. ఛైర్మన్లు సమిష్టిగా మాట్లాడుతూ ప్రజల్లో అపోహలు కలిగించే రాజకీయ వ్యాఖ్యలు కాకుండా, అభివృద్ధి, సంక్షేమం, ప్రజా ప్రయోజనాలపై చర్చ జరగాలని సూచించారు. పీఏసీఎస్‌కు సంబంధించిన అంశాలు విచారణలో ఉన్నందున అధికారిక నివేదిక వెలువడే వరకు శ్రీధర్ ఓపిక పట్టాలని కోరారు.






# విద్యార్థుల బంగారు భవిష్యత్‌కు పునాదులు

## - గరుడభద్ర జెడ్పీ హైస్కూల్‌లో పదో తరగతి టాపర్లకు ఘన సన్మానం

**పలాస, మే 23 (వార్త):** పదో తరగతి పబ్లిక్ పరీక్షల్లో అత్యధిక మార్కులు సాధించిన విద్యార్థులను ప్రోత్సహించడం ద్వారా వారి బంగారు భవిష్యత్తుకు పునాదులు వేస్తున్నామని తాజా మాజీ సర్పంచ్ గూడ గిరిజ ఈశ్వరరావు అన్నారు. గురువారం గరుడభద్ర జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో పదో తరగతి టాపర్లకు ఘనంగా సన్మాన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ముగ్గురు విద్యార్థులకు రూ. 10 వేల చొప్పున ఆర్థిక సహకారం అందించి, శాలువాలతో సత్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ "వైయస్సార్‌సీపీ ప్రభుత్వంలో ఆనాడు ముఖ్యమంత్రిగా వైయస్ జగన్ చేపట్టిన నాడు-నేడు పథకం కింద ప్రభుత్వ పాఠశాలల ఆధునికీకరణ, విద్యా రంగంలో చేపట్టిన సంస్కరణల ఫలితంగా ఈరోజు ఉత్తమ ఫలితాలు సాధించారన్నారు. ప్రభుత్వ పాఠశాలల్లో నేటి ప్రభుత్వం కూడా విద్యా రంగంలో సంస్కరణలు కొనసాగిస్తే విద్యార్థుల్లో సృజనాత్మకత పెంపొందుతుందని అభిప్రాయపడ్డారు. "తాను సర్పంచ్‌గా ఎంపికైన నాటి నుంచి ప్రతీ ఏటా ప్రభుత్వ పాఠశాలలో చదువుకొని మంచి మార్కులు సాధిస్తున్న విద్యార్థులకు సత్కరించడం ఆనవాయితీగా పెట్టుకున్నానన్నారు. విద్యార్థులు జీవితంలో ఉన్నత స్థానంలో నిలవాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో హైస్కూల్ ప్రధాన ఉపాధ్యాయురాలు వందన, ఉపాధ్యాయులు తలగాపు మోహన్ రావు, ఉప సర్పంచ్ ఎం.చంద్రభూషణ్, ఆర్.శాంతమూర్తి, సైనింగ్ స్టార్ యువజన సంఘం అధ్యక్షులు పి.భీమారావు, వై ఆనందరావు, ఏ.దానేశ్, వై.అప్పారావు, కె.గురయ్య, ఎం.నారాయణరావు, కె.రామారావు, కె.చిరంజీవి, వై.శ్రీను, కె.రాజు, ఎస్.ఈశ్వరరావు, ఎం.అఖిల్, హిమసిద్ధు, జి.నరేష్, నిఖిల్, మహేష్, కుర్మారావు, రామారావు, సాయి, దిలీప్, విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

# అనుమతులు లేని విద్యాసంస్థలపై చర్యలేవీ?

## - ఒక బ్రాంచ్ పర్మిషన్ తో పలుచోట్ల బ్రాంచ్లు - నిబంధనలకు విరుద్ధంగా కార్పొరేట్ విద్యాసంస్థలు లక్షలాది రూపాయల ఫీజులు వసూలు - పట్టించుకోని విద్యాశాఖ అధికారులు

## - ఏఐఎస్ఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి సిహెచ్ రవి




**మందస/శ్రీకాకుళం మే 23(వార్త):** అఖిల భారత విద్యార్థి సమైక్య శనివారం క్రాంతి భవన్ నందు ముఖ్య నాయకుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఏఐఎస్ఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి సిహెచ్ రవి మాట్లాడుతూ శ్రీకాకుళంలో శ్రీ చైతన్య, నారాయణ, ఎస్సార్, జేవై, ఆదిత్య సంస్థలు ప్రభుత్వ నిబంధనలకు విరుద్ధంగా నిర్వహిస్తామన్నారు వాటిపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వం నిర్ణయించిన ఫీజు వసూలు చేయకుండా వాటికి రెట్టింపు వసూలు చేస్తూ నిబంధనలకు విరుద్ధంగా టీచింగ్ ఫ్యాకల్టీ లేకుండా ట్యూటర్లను ఏర్పాటు చేసుకొని విద్యాసంస్థలను నిర్వహిస్తామన్నారు .శ్రీ చైతన్య విద్యా సంస్థలపైన లోతుగా విచారణ జరిపి చర్యలు తీసుకోవాలన్నారు. ఎస్ఆర్ జూనియర్ కళాశాల యాజమాన్యులు విద్యార్థుల తల్లిదండ్రులకు మాయమాటలు చెప్పి.. కళాశాలలో చేరకముందు ఒక ఫీజు చేరిన తర్వాత రకరకాల పేర్లతో మరొక ఫీజు వసూలు చేస్తూ తల్లిదండ్రుల నుంచి వేల రూపాయలు దండుకుంటున్నారన్నారు. పుస్తకాలు.. హాట్‌వాటర్, యూనిఫాం, కాషన్ డిపాజిట్ పేరుతో ఎస్ఆర్ జూనియర్ కళాశాలపైన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. లేనిపక్షంలో పెద్ద ఎత్తున ఆందోళన నిర్వహిస్తామని ఈ సందర్భంగా హెచ్చరించారు. కార్యక్రమంలో ఏఐఎస్ఎఫ్ జిల్లా నాయకులు దాసరి సోమశేఖర్, అశోక్, యోగేశ్వరరావు, మనోహర్, కౌశిక్ తదితరులు పాల్గొన్నారు.

# తొగిరిలో విద్యుత్ స్తంభాలు, వీధి దీపాలు

## - అమ్మవారి ఆలయం,చెరువు మార్గానికి వెలుగులు
## -ఎన్నో ఏళ్ల సమస్యకు పరిష్కారం
## లభించిందంటూ గ్రామస్తుల హర్షం

**సారవకోట, మే 23 (వార్త):** తొగిరి గ్రామంలో ఎన్నో ఏళ్లుగా పరిష్కారానికి నోచుకోని అమ్మవారి ఆలయం, చెరువుకు వెళ్లే రహదారిలో విద్యుత్ స్తంభాలు, వీధి దీపాల ఏర్పాటు పనులు పూర్తయ్యాయి. దీంతో గ్రామ ప్రజలు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. గ్రామంలోని అమ్మవారి గుడి, చెరువుకు వెళ్లే మార్గంలో సరైన విద్యుత్ సౌకర్యాలు లేకపోవడంతో భక్తులు, గ్రామస్తులు రాత్రి వేళల్లో ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఈ సమస్యను స్థానిక ప్రజలు పలుమార్లు అధికారుల దృష్టికి తీసుకెళ్లినప్పటికీ పరిష్కారం కాలేదని గ్రామస్తులు తెలిపారు. ఎమ్మెల్యే బగ్గు రమణమూర్తి సహకారంతో, ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర తెలుగుదేశం పార్టీ బీసీ కమిటీ అధికార ప్రతినిధి ధర్మాన తేజ్‌కుమార్ చొరవతో ఈ సమస్యకు పరిష్కారం లభించినట్లు స్థానిక నాయకులు పేర్కొన్నారు.

తొగిరి గ్రామ పంచాయతీ తెలుగుదేశం పార్టీ యువ నాయకుడు, సారవకోట మండల తెలుగు యువత అధ్యక్షుడు పిళ్లా నందకిషోర్ ఆధ్వర్యంలో విద్యుత్ స్తంభాలు, వీధి దీపాల ఏర్పాటు చేపట్టారు. వీధి దీపాలు ఏర్పాటు కావడంతో ఆలయానికి వెళ్లే భక్తులకు, చెరువు ప్రాంతానికి వెళ్లే గ్రామస్తులకు రాత్రి వేళల్లో సౌకర్య వంతమైన రాకపోకలు సాధ్యమవుతాయని తెలిపారు. గ్రామాభివృద్ధికి అవసరమైన మౌలిక సదుపాయాల కల్పనలో భాగంగా ఈ పనులు చేపట్టినట్లు నాయకులు వెల్లడించారు. ఎన్నో సంవత్సరాలుగా ఎదురుచూస్తున్న సమస్యకు పరిష్కారం లభించడంతో గ్రామ ప్రజలు హర్షం వ్యక్తం చేస్తూ సహకరించిన ప్రజాప్రతినిధులు, నాయకులకు కృతజ్ఞతలు తెలిపారు. గ్రామంలో మిగిలిన అభివృద్ధి పనులను కూడా త్వరితగతిన పూర్తి చేయాలని ఈ సందర్భంగా కోరారు.



# డీఎన్‌టీలోకి రెడ్డిక సామాజికవర్గం

**ఇచ్ఛాపురం మే 23 (వార్త):** రెడ్డిక సామాజికవర్గం డీ నోటి ఫైడ్ ట్రైబల్ విభాగంలోకి చేర్చబడ్డారని ఇది కూటమి ప్రభుత్వం ఘన విజయం అని రాష్ట్ర రెడ్డిక కార్పొరేషన్ ఛైర్మన్ కొండ శంకర్ రెడ్డి అన్నారు. ఈ మేరకు శనివారం ఆయన తన ఛాంబర్‌లో విలేకరుల సమావేశంలో మాట్లాడారు. సామాజికంగా, ఆర్థికంగా, రాజకీయంగా వెనుకబడిన రెడ్డిక సామాజికవర్గం 1871లో బ్రిటిష్ ప్రభుత్వంపై పోరాడుతున్న సందర్భంగా సంచార జాతుల కింద నిషేధం విధించారని చెప్పారు. 1952లో బీసీ ఏగా గుర్తించారన్నారు. గతంలో కొంత మంది రెడ్డిక కులాన్ని వెనుకబడిన జాబితాలోంచి తొలగిస్తారని భయభ్రాంతులకు గురి చేశారన్నారు. కానీ ఆ భయాన్ని కూటమి ప్రభుత్వం తొలగించిందన్నారు. ఈ విషయమై ముఖ్యమంత్రి చంద్రబాబు, కేంద్ర మంత్రి రామ్మోహన్ నాయుడు, రాష్ట్ర మంత్రులు కొల్లు రవీంద్ర, సవిత, నారా లోకేష్, ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే బెందాళం అశోక్‌లకు కృతజ్ఞతలు తెలుపుతున్నామన్నారు. కార్యక్రమంలో ఏఎంసీ ఛైర్మన్ మణి ప్రకాశ్ రెడ్డి, పీఏసీఎస్ అధ్యక్షుడు పేదిని బాబ్జీ, దక్కత ఢిల్లీరావు, సాడి సహదేవ్ రెడ్డి, ఆసి లీలారాణి, నందికి జానీ, దక్కత కామేశ్వరరావు, ఆసి సత్యం, ఆసి ధర్మ రాజు, పేదిని దుర్యోధన, సూర్యనారాయణ, రమేష్, పీతాంబర్, ఉగ్రపల్లి శంకర్ నారాయణ ఆచారి తదితరులు పాల్గొన్నారు.



జాతీయ
# వార్త
తెలుగు దిన పత్రిక
శ్రీకాకుళం

## మామిడిపల్లి ఉత్సవాల్లో వైకాపా నేతలు

**సోంపేట, మే 23(వార్త):** మామిడిపల్లి గ్రామంలో జరుగుతున్న అమ్మవారి సంబరం మహోత్సవాలలో ఎమ్మెల్సీ నర్తు రామారావుతో పాటు పలువురు వైసీపీ నేతలు ప్రజాప్రతినిధులు శనివారం సాయంత్రం పాల్గొన్నారు. గ్రామ పెద్దల ఆహ్వానం మేరకు ఉత్సవాలకు హాజరై అమ్మవారితోపాటు గ్రామంలో శ్రీ వెంకటేశ్వర స్వామి వారిని దర్శించుకున్నారు.

సోంపేట కంచిలి ఎంపీపీలు డాక్టర్ నిమ్మన దాసు, పైల దేవదాసు, రెడ్డి భాస్కరరావు, బతకల మోహన్ రావు తదితరులు పాల్గొన్నారు.



# వడదెబ్బపై ప్రజలు అప్రమత్తంగా ఉండాలి

### - వెలుగు గ్రామీణాభివృద్ధి సంస్థ

### అసిస్టెంట్ ప్రాజెక్టు మేనేజర్ పైడి కూర్మారావు

**మందస, మే 23(వార్త):** వేసవిలో ఉష్ణోగ్రత ఎక్కువగా ఉండటంతో గ్రామాల్లో వడదెబ్బ వచ్చే అవకాశం ఉందని, ప్రజలు అప్రమత్తంగా ఉండాలని వెలుగు గ్రామీణాభివృద్ధి సంస్థ అసిస్టెంట్ ప్రాజెక్టు మేనేజర్ పైడి కూర్మారావు కోరారు. రైతు ఉత్పత్తిదారుల సంఘాల(ఎఫ్.పి.ఓ.) అవగాహన, సమీక్షా సమా వేశంలో శనివారం ఆయన పాల్గొని మాట్లాడారు. గ్రామాల్లో మహిళా సంఘాలు అందరికీ అవగాహన కల్పించాలన్నారు. గ్రామాల్లో రైతులు, ఉపాధి హామీ పనులు వెళ్తున్న కూలీలు ఉదయం 10గంటల లోపు, సాయంత్రం 4గంటల తరువాత మాత్రమే ఇంటి నుంచి బయటకు వెళ్లాలని తెలిపారు. అత్యవసరం అయితే తప్ప బయటకు క్యాంప్‌లకు వెళ్లవద్దని సూచించారు. ఒక వేళ తప్పనిసరిగా వెళ్లాల్సి వేస్తే గొడుగులు, టోపీలు, సన్ గ్లాసులు వాడాలని అవగాహన కల్పించారు. తలనొప్పి, తల తిరగడం, వాంతులు, ఎక్కువగా చెమటలు పట్టి స్పృహ కోల్పోవడం వంటి లక్షణాలు ఎవరికైనా కనిపిస్తే వెంటనే చల్లని వాతావరణం ఉండే ప్రదేశాలకు తీసుకొని వెళ్లి ప్రథమ చికిత్స అందించాలని తెలిపారు. వృద్ధులు, చిన్న పిల్లలు, గర్భిణుల విషయంలో వెంటనే దగ్గరలో ఉన్న డాక్టర్‌ను సంప్రదించి తగు చికిత్స పొందాలన్నారు. గ్రామాల్లో రైతులు ఉపాధి హామీ పనులు వెళ్తున్న కూలీలు, మహిళలు అందరికీ పూర్తి స్థాయిలో అవగాహన కల్పించాలని కోరారు. వదులుగా ఉండి గాలి బాగా తగిలే కాటన్ వస్త్రాలు ధరించడం, కొబ్బరి నీరు, గ్లూకోజ్, మజ్జిగ, నిమ్మరసం మొదలగు లిక్విడ్స్ ఎక్కువగా వాడేటట్లు అవగాహన కల్పించడం వల్ల ముందస్తు చర్యలతో ప్రమాదాల బారిన పడకుండా జాగ్రత్తలు తీసుకొనేటట్లు అవగాహన కల్పించాలని న్నారు. కార్యక్రమంలో లీగల్ కోఆర్డినేటర్ తారకమోహన్, క్లస్టర్ కోఆర్డినేటర్ బాలకృష్ణ, వెలుగు సిబ్బంది, క్లస్టర్ వి.ఓ.ఏ.లు పాల్గొన్నారు.





## ఘనంగా ఏపీటీపీసీ చైర్మన్..

# వజ్జ జన్మదిన వేడుకలు

**పలాస, మే 23 (వార్త):** ఏపీటీపీసీ చైర్మన్, టీడీపీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి వజ్జ బాబూరావు జన్మదిన వేడుకలు పలాసలో అంబరాన్నంటిన సంబరాల మధ్య శనివారం ఘనంగా నిర్వహించారు. అభిమానులు, కార్యకర్తలు పెద్ద ఎత్తున బాబూరావుకి జన్మదిన శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ సందర్భంగా పలువురు అభిమానులు స్వచ్ఛందంగా రక్తదానం చేసి తమ సేవా స్ఫూర్తిని చాటుకున్నారు. తెలుగుదేశం పార్టీ యువనేత సాసుమాన చంద్రమౌళి ఆధ్వర్యంలో అన్నదానం నిర్వహించారు. స్థానిక రామాలయం, అన్న క్యాంటీన్‌లో జరిగిన ఈ కార్యక్రమంలో తాడి చిరు, కొల్లి జోగారావు, జగదీష్ పండా, సుధాకర్, టీడీపీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు, ప్రజలు భారీ సంఖ్యలో తరలివచ్చి బాబురావుకు శుభాకాంక్షలు తెలిపారు.

## 'భాస్కరుని'

# సేవలు భేష్

### -మందస పోస్టుమాస్టర్ 'దాసరి'కి ఎక్స్ లెన్స్ అవార్డు

### -అభినందించిన మందస ప్రజలు

**మందస, మే 23(వార్త):** మందస పోస్టుమాస్టర్‌గా, సమాజ సేవకునిగా.. దాసరి భాస్కరరావు ఉత్తమ సేవలందిస్తున్నారు. బాధ్యతతో ఉద్యోగమే కాకుండా సమాజానికి ఉపయోగపడే మంచి కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. దీంతో ఈ ప్రాంతీయులు భాస్కరరావు అంటే ఎంతో అభిమానిస్తారు. పోస్టు మాస్టర్ గా దాసరి భాస్కరరావు అందిస్తున్న ఉత్తమ సేవలకు ఖాతాదారులు, పోస్టాఫీసుకు నిత్యం వచ్చే ప్రజలు కూడా ఆయన అందిస్తున్న సేవలకు ఫిదా అవుతున్నారు. మందస పోస్టాఫీసు చరిత్రలో ఎన్నడూలేని విధంగా భాస్కరరావు 2279 పొదుపు ఖాతాలను తెరిపించారు. పొదుపు ఖాతాల నమోదు ఆయన చూపించిన చొరవ, శ్రద్ధ, అంకితభావం, కృషి శ్రీకాకుళం పోస్టల్ డివిజన్ లో మొదటి స్థానంలో నిలిపాయి. భాస్కరరావు చేస్తున్న సేవలను జిల్లా ఉన్నతాధికారులు గుర్తించారు. 2025-26 సంవత్సరానికి డివిజనల్ ఎక్స్ లెన్స అవార్డును శ్రీకాకుళంలో మందస పోస్టు మాస్టర్ దాసరి భాస్కరావుకు అందజేశారు. శ్రీకాకుళంలోని ఇందిరా విజ్ఞాన్‌భవన్‌లో జరిగిన ప్రత్యేక కార్యక్రమంలో



పోస్టల్ సూపరింటెండెంట్ ఆఫ్ శ్రీకాకుళం వి.హరిబాబు.. మొదటి బహుమతిని భాస్కరరావుకు అందజేశారు. ఈ సందర్భంగా మందస ప్రాంతీయులు అభినందనలు తెలిపారు. భాస్కరరావు మరిన్ని అవార్డులు, రివా ర్డులు పొందాలని ఆకాంక్షించారు.





# ప్రతీ ఒక్కరూ విధిగా మొక్కలు నాటాలి

### -ప్రముఖ సంఘ సేవకులు

### గిన్ని తిరుపతిరెడ్డి

**మందస, మే 23(వార్త):** ప్రతీ ఒక్కరూ విధిగా మొక్కలు నాటాలని పలువురు వక్తలు అన్నారు. మందసలోని గో గ్రీన్ సంస్థ ఏర్పాటు చేస్తున్న ఐరన్ ట్రీ గార్డుల కార్యక్రమాన్ని శనివారం ప్రముఖ సంఘ సేవకులు గిన్ని తిరుపతిరెడ్డి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దేశంలో రోజురోజుకు సూర్యతాపం తీవ్రస్థాయిలో పెరుగుతోందని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రతీ ఒక్కరూ విధిగా ఒక మొక్క ప్రతీ ఏడాది నాటి దాన్ని పెంచి పోషించి సంరక్షించాలని ఆయన పిలుపునిచ్చారు. జనసేన ఉమ్మడి జిల్లా కార్యదర్శి సంతోష్ పండా మొక్కకు నీరు పోశారు. మొక్కలు నాటే కార్యక్రమం రాష్ట్రవ్యాప్తంగా జరుగుతుందని.. మందసలో కూడా సాయి మోహన్ రిసోర్సెస్ ఫౌండేషన్ వారి ఆర్థిక సహకారంతో గో గ్రీన్ సంస్థ మొక్కలు నాటే కార్యక్రమం కొనసాగిస్తుండడం గర్వకారణమని అన్నారు. కార్యక్రమంలో వీవీ రమణ మూర్తి, సంతోష్ పండా, ఇప్పిలి వెంకటేశ్వరరావు, బర్లే హరికృష్ణ, గుంట మురళి, వూణ్న ప్రసాద్, మామిడి కోదండరావు తదితరులు పాల్గొన్నారు.

# ఇచ్ఛాపురంలో ఆపరేషన్ క్లీన్‌స్వీప్

**ఇచ్ఛాపురం మే 23 (వార్త):** రాష్ట్ర ప్రభుత్వం ఆదేశాలను అనుసరించి ఇచ్ఛాపురం పురపాలక సంఘం పరిధిలో కమిషనర్ రమేష్ ఆధ్వ ర్యంలో "ఆపరేషన్ క్లీన్ స్వీప్" కార్యక్రమం ప్రారంభించారు. ఈ కార్యక్రమం 4 వారాల పాటు నిర్వహించనున్నారు.

### మొదటి వారం : మే 22 - 28

-రోడ్డు స్వీపింగ్
-ఎల్లో / రెడ్ స్పాట్స్
-విజిబుల్ క్లీన్లీనెస్

### రెండవ వారం : మే29 -జూన్ 4

- డ్రైన్ క్లీనింగ్
- బ్యాక్ లేన్స్

### మూడవ వారం : జూన్ 5 -11

- రెసిడెన్షియల్, కమర్షియల్ వేస్ట్ జనరేటర్స్

### నాల్గవ వారం : జూన్ 12 - 20

- టాయిలెట్ క్లీనింగ్
- జీవీపీ క్లీనింగ్ చేపట్టనున్నారు.

ఇలా నెల రోజుల పాటు వివిధ అవగాహన కార్యక్రమాలు చేపట్టడానికి తగిన చర్యలు తీసుకున్నారు. ఈ కార్యక్రమం సురంగి రాజా మైదానం నందు శనివారం ప్రారంభించారు. మున్సిపల్ కమిషనర్ ఆధ్వర్యంలో మైదానంలో శ్రమదాన కార్యక్రమం జరిపారు. కార్యక్రమంలో మున్సిపల్ సిబ్బంది, సచివాలయ సిబ్బంది, మెప్మా సిబ్బంది, స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులు పాల్గొన్నారు.



# పరిసరాలు పరిశుభ్రంగా ఉంచుకోవాలి



**పలాస, మే 23 (వార్త):** పరిసరాలు పరిశుభ్రంగా ఉంచుకోవాలని పలాస ఎమ్మెల్యే గౌతు శిరీష ప్రజలకు విజ్ఞప్తి చేశారు. ఆపరేషన్ క్లీన్ స్వీప్ లో భాగంగా " ఒక రాష్ట్రం- ఒక పరిశుభ్రత " క్రింద రాష్ట్రమంతటా శుభ్రమైన రోడ్లు, శుభ్రమైన కాలువలు, శుభ్రమైన పరిసరాలు అనే నినాదంతో శనివారం పలాస నియోజకవర్గం పలాస కాశీబుగ్గ మున్సిపాలిటీ పరిధి కాశీబుగ్గ ఓల్డ్ బస్టాండ్ ఆవరణలో జరిగిన కార్యక్రమంలో పాల్గొన్న పలాస ఎమ్మెల్యే గౌతు శిరీష, ఈ కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ శ్రీనివాసులు, మునిసిపల్ సిబ్బంది, కూటమి ముఖ్య నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

### ఆర్టీసీ కాంప్లెక్స్ ఎదురుగా..

## స్పీడ్ బ్రేకర్లు ఏర్పాటు చేయాలి

**- తొలగించి వారం రోజులైనా పునరుద్ధరణ లేదు**

**- ప్రమాదాల నివారణకు వెంటనే చర్యలు తీసుకోవాలని స్థానికుల విజ్ఞప్తి**

**నరసన్నపేట, మే 23 (వార్త):** నరసన్నపేట ఆర్టీసీ కాంప్లెక్స్‌కు ఎదురుగా ఉన్న ప్రధాన రహదారిపై స్పీడ్‌బ్రేకర్లు తొలగించి.. వారం రోజులు గడిచినా ఇప్పటికీ తిరిగి ఏర్పాటు చేయకపోవడంతో స్థానికులు ఆందోళన వ్యక్తం చేస్తు న్నారు. రద్దీ ప్రాంతమైన ఈ ప్రాంతంలో చిన్నపాటి ప్రమాదాలు చోటు చేసు కుంటున్నాయన్నారు. ఇటీవల ముఖ్యమంత్రి పర్యటన సందర్భంగా రహదారి నిర్వహణ పనుల్లో భాగంగా అక్కడ ఉన్న స్పీడ్ బ్రేకర్లను అధికారులు తొలగించి నట్లు స్థానికులు తెలిపారు. అయితే పర్యటన ముగిసి వారం రోజులకు పైగా గడిచినా కొత్త స్పీడ్ బ్రేకర్ల ఏర్పాటు చేపట్టకపోవడంతో వాహనాలు అధిక వేగంతో ప్రయాణిస్తున్నాయంటున్నారు. ఆర్టీసీ కాంప్లెక్స్ ప్రాంతం నిత్యం ప్రయాణికులు, విద్యార్థులు, వ్యాపారులు, పాదచారులతో రద్దీగా ఉంటుందని, ఇలాంటి ప్రాంతాల్లో స్పీడ్ బ్రేకర్లు ప్రమాదాల నివారణకు కీలక పాత్ర పోషిస్తాయని స్థానికులు అభిప్రాయపడుతున్నారు. ముఖ్యంగా బస్సులు, ద్విచక్ర వాహనాలు, ఆటోలు అధిక వేగంతో ప్రయాణించడంతో రహదారి దాటే పాదచారులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారన్నారు. ఇప్పటికే కొన్ని చిన్నపాటి ప్రమాదాలు జరిగినట్లు స్థానికులు పేర్కొంటూ, పెద్ద ప్రమాదాలు జరగకముందే సంబంధిత అధికారులు స్పందించాలని కోరుతున్నారు. ప్రజల భద్రతను దృష్టిలో ఉంచుకుని ఆర్టీసీ కాంప్లెక్స్ ఎదురుగా తొలగించిన స్పీడ్ బ్రేకర్లను వెంటనే పునరుద్ధరించాలని విజ్ఞప్తి చేస్తున్నారు. రద్దీ ప్రాంతాల్లో ట్రాఫిక్ నియంత్రణ చర్యలను మరింత బలోపేతం చేసి పాదచారులు, వాహనదారుల భద్రతకు ప్రాధాన్యం ఇవ్వాలని స్థానికులు కోరుతున్నారు.



**- ఉదయం, సాయంత్రం వేళల్లో లారీల ప్రవేశాన్ని నియంత్రించాలని స్థానికుల విజ్ఞప్తి**

### భారీ వాహనాలతో ..

**- రాకపోకలకు అంతరాయం**

**- వ్యాపారుల ఆందోళన**

## కళాశాల రహదారిలో ట్రాఫికర్

**నరసన్నపేట, మే 23(వార్త):** నరసన్నపేటలోని కళాశాల రహదారి ట్రాఫిక్ సమస్యలతో నిత్యం రద్దీగా మారి ప్రజలకు ఇబ్బందులు కలిగిస్తోందని స్థాని కులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ముఖ్యంగా భారీ వాహనాలు ఈ మార్గంలో ప్రయాణించడం వల్ల రాకపోకలకు తీవ్ర అంతరాయం ఏర్పడుతోందన్నారు. కళాశాల రహదారి పట్టణంలోని ప్రధాన వాణిజ్య, విద్యా కేంద్రాలను అను సంధానించే కీలక మార్గం కావడంతో రోజూ విద్యార్థులు, వ్యాపారులు, ఉద్యో గులు, ప్రజలు అధిక సంఖ్యలో ప్రయాణిస్తుంటారు. ఇలాంటి పరిస్థితుల్లో భారీ లారీలు, సరుకు రవాణా వాహనాలు రహదారిలోకి ప్రవేశించడంతో తరచూ ట్రాఫిక్ నిలిచిపోతున్నట్లు స్థానికులు పేర్కొంటున్నారు. ఇటీవల మార్కెట్ ప్రాంతంలో భారీ వాహనాల రాకపోకలను నియంత్రిస్తామని పోలీసు అధికా రులు ప్రకటించినప్పటికీ, క్షేత్రస్థాయిలో అమలు కనిపించడం లేదని వ్యాపా రులు ఆరోపిస్తున్నారు. ఒకవైపు చిన్న వాహనాల రాకపోకలపై పరిమితులు విధిస్తుండగా, మరోవైపు భారీ లారీలు అదే మార్గంలో ప్రయాణించడంపై సందేహాలు వ్యక్తం చేస్తున్నారు. ట్రాఫిక్ సమస్యలతో కళాశాల రహదారిపై ఉన్న చిన్న వ్యాపారుల వ్యాపార కార్యకలాపాలు కూడా ప్రభావితమవుతున్నాయని పలువురు వ్యాపారులు చెబుతున్నారు. రహదారిపై తరచూ ట్రాఫిక్ జామ్‌లు ఏర్పడటంతో వినియోగదారులు దుకాణాలకు చేరుకోవడంలో



ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని వాపోతున్నారు. ఉదయం పాఠశాలలు, కళాశాలల సమ యం, సాయంత్రం రద్దీ వేళల్లో భారీ వాహనాలను మార్కెట్, కళాశాల రహదారిలోకి అనుమతించకుండా ప్రత్యామ్నాయ మార్గాల ద్వారా మళ్లించాలని స్థానికులు, వ్యాపారులు కోరుతున్నారు. ట్రాఫిక్ నియంత్రణ చర్యలను కఠి నంగా అమలు చేసి ప్రజలకు ఇబ్బందులు లేకుండా చూడాలని సంబంధిత అధికారులకు విజ్ఞప్తి చేస్తున్నారు.

## ప్రభుత్వ పాఠశాలల్లో నాణ్యమైన విద్య

**- తల్లిదండ్రులు ప్రభుత్వ బడులను ఆదరించాలి**

**- ఎంఈఓ శ్రీనివాసరెడ్డి**

**- ఉపాధి కూలీలతో అవగాహన సమావేశం**

**పోలాకి, మే 23(వార్త):** తల్లిదండ్రులు ఎండల్లో, వానల్లో కష్టపడి సంపా దించిన డబ్బును ప్రైవేటు పాఠశాలల ఫీజుల కోసం ఖర్చు చేస్తున్నారని, అదే సమయంలో ప్రభుత్వ పాఠశాలల్లో నాణ్యమైన విద్యతో పాటు అనేక సౌకర్యాలు ఉచితంగా అందుబాటులో ఉన్నాయని మండల విద్యాశాఖాధికారి (ఎంఈఓ) ఎస్.శ్రీనివాసరెడ్డి తెలిపారు.

శనివారం పోలాకి మండలం ప్రియాగ్రహారంలో ఉపాధి హామీ కార్మికులతో నిర్వహించిన అవగాహన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. ప్రస్తుతం ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులకు ఉచిత పాఠ్యపుస్తకాలు, యూనిఫాంలు, మధ్యాహ్న భోజనం, బూట్లు, బ్యాగులు తదితర సదుపాయాలు అందుతున్నాయని వివరించారు. ప్రైవేటు పాఠశాలల్లో అడ్మిషన్ ఫీజులు, ట్యూషన్ ఫీజులు, రవాణా, పుస్తకాలు, యూనిఫాంల పేరుతో అదనపు భారం పడుతుందన్నారు. అయితే ప్రభుత్వ పాఠశాలల్లో నాణ్యమైన బోధనతో పాటు మౌలిక వసతులు కూడా మెరుగుపడుతున్నాయని చెప్పారు. ప్రభుత్వం విద్యారంగ అభివృద్ధికి ప్రత్యేక ప్రాధాన్యత ఇస్తోందని, పాఠశాలల్లో ఆధునిక సదుపాయాలు, డిజిటల్ బోధన, పరిశుభ్రమైన తరగతి గదులు, తాగునీటి సౌక ర్యాలు కల్పించేందుకు చర్యలు చేపడుతోందని తెలిపారు. ఈ అవకాశాలను సద్వినియోగం చేసుకుని తమ పిల్లలను సమీప ప్రభుత్వ పాఠశాలల్లో చేర్పించాలని తల్లిదండ్రులకు విజ్ఞప్తి చేశారు. విద్యార్థుల భవిష్యత్తు కోసం ప్రభుత్వ పాఠశాలలను బలోపేతం చేయడంలో ప్రజల సహకారం అవసరమని ఆయన పేర్కొన్నారు. కార్యక్రమంలో ఉపాధి హామీ కార్మికులు, విద్యాశాఖ సిబ్బంది పాల్గొన్నారు.



## మౌలిక వసతుల అభివృద్ధే ప్రభుత్వ లక్ష్యం



**పలాస, మే 23 (వార్త):** మౌలిక వసతుల అభివృద్ధికి కూటమి ప్రభుత్వం కట్టుబడి ఉందని పలాస ఎమ్మెల్యే గౌతు శిరీష అన్నారు. పలాస నియోజకవర్గం పలాస-కాశీబుగ్గ మున్సిపాలిటీ నర్సిపురం గ్రామంలో గ్రామాభివృద్ధికి మరొక ముందడుగు పడిందని, 15వ ఫైనాన్స్ కమిషన్ నిధుల ద్వారా మంజూరైన రూ.15 లక్షల వ్యయంతో నిర్మించనున్న సీసీ రోడ్డుకు పలాస ఎమ్మెల్యే గౌతు శిరీష శనివారం శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ గ్రామాల్లో మౌలిక వసతుల అభివృద్ధికి రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేక ప్రాధాన్యత ఇస్తోందని తెలిపారు. ప్రజలకు మెరుగైన రహదారి సౌకర్యాలు కల్పించడం ద్వారా రాకపోకలు సులభతరమవుతాయన్నారు. నర్సిపురం గ్రామ అభివృద్ధికి అవసరమైన ప్రతి పనికి తన పూర్తి సహకారం ఉంటుందని హామీ ఇచ్చారు. గ్రామ ప్రజలు కూడా సీసీ రోడ్ నిర్మాణానికి నిధులు మంజూరు చేసి పనులు ప్రారంభించిన ఎమ్మెల్యేకి కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో పలాస మున్సిపల్ కమిషనర్ ఐ.శ్రీనివాసులు, ఏఎంసీ చైర్మన్ మల్లా శ్రీనివాసరావు, బీసీ సెల్ అధ్యక్షుడు లొడగల కామేష్, పలాస కాశీబుగ్గ మున్సిపాలిటీ అధ్యక్ష, కార్యదర్శులు బడ్డ నాగరాజు, సప్ప నవీన్, ముఖ్య నాయకులు, మున్సిపల్ సిబ్బంది పాల్గొన్నారు.

## శిథిలావస్థలో సర్వసభ్య సమావేశ మందిరం

**- పైన అంతస్తు శ్లాబ్ బలహీనతపై ఆందోళన**

**- ప్రమాదం జరగకముందే మరమ్మతులు చేపట్టాలని ప్రజాప్రతినిధుల విజ్ఞప్తి**

**జలుమూరు, మే 23(వార్త):** జలుమూరు మండల సర్వసభ్య సమావేశ మందిరంపైన అంతస్తు శ్లాబ్ శిథిలావస్థకు చేరుకోవడంతో అధికారులు, ప్రజాప్రతినిధులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. భవనాన్ని పరిశీలించి తక్షణమే పూర్తిస్థాయి మరమ్మతులు చేపట్టాలని సంబంధిత శాఖలను కోరుతున్నారు. స్థానికుల కథనం ప్రకారం, సమావేశ మందిరం పైభాగంలోని శ్లాబ్ బలహీనపడిపోయి అనేక చోట్ల దెబ్బతిన్నట్లు కనిపిస్తోంది. శ్లాబ్‌పై నడిచినప్పుడు అసాధారణ శబ్దాలు వినిపిస్తున్నాయని, దీంతో అక్కడికి వెళ్లేందుకు కూడా భయంగా ఉందని పలువురు పేర్కొంటున్నారు. మండల స్థాయి సమావేశాలు, అధికారిక కార్యక్రమాలకు ఉపయోగించే ఈ భవనం రోజూ ప్రజాప్రతినిధులు, అధికారులు, సిబ్బంది రాకపోకలు ఉండే ప్రదేశం కావడంతో భద్రతా పరమైన ఆందోళనలు వ్యక్తమవుతున్నాయి. సకాలంలో మరమ్మతులు చేపట్టకపోతే భవనం మరింత దెబ్బతినే ప్రమాదం ఉందని ప్రజాప్రతినిధులు హెచ్చరిస్తున్నారు. భవన నిర్మాణ స్థితిగతులను సాంకేతిక నిపుణులతో పరి శీలించి అవసరమైతే ప్రత్యేక నిధులు కేటాయించి మరమ్మతులు చేపట్టాలని వారు కోరుతు న్నారు. ప్రమాదం సంభవించిన తర్వాత చర్యలు తీసుకోవడంకంటే ముందస్తుగా స్పందించి భవనాన్ని సురక్షితంగా మార్చడం అవసరమని అభిప్రాయపడుతున్నారు. ప్రజా ప్రతినిధులు, స్థానికులు సంబంధిత అధికారులు వెంటనే స్పందించి సర్వసభ్య సమావేశ మందిరానికి అవసరమైన మరమ్మతులు చేపట్టి భద్రతా ప్రమాణాలు కల్పించాలని విజ్ఞప్తి చేస్తున్నారు.



### చలపతి కుటుంబానికి సి.ఎమ్.ఆర్.ఎఫ్

## చెక్కును అందజేసిన ఎమ్మెల్యే శిరీష

**పలాస, మే 23 (వార్త):** వజ్రపు కొత్తూరు మండలం, వజ్రపుకొత్తూరు గ్రామంనకు చెందిన సిర్ల చలపతి రావు ఎలుగు బంటి దాడిలో గాయాలపాలై హాస్పిటల్‌లో చికిత్స పొందుతూ మరణించారు. అతని కుటుంబ సభ్యులు స్థానిక నాయకుల సహాయంతో ఎమ్మెల్యే గౌతు శిరీష దృష్టికి తీసుకుని వెళ్లగా, ఆమె ఆదేశాల మేరకు ముఖ్యమంత్రి సహాయానిదికి నమోదు చేశారు. శనివారం పలాస ఎమ్మెల్యే కార్యాలయంలో లబ్దిదారుల కుటుంబానికి రూ. 2,00,000/- (రెండు లక్షల) విలువైన ముఖ్య మంత్రి సహాయ నిధి (సీఎంఆర్ఎఫ్) చెక్కును ఎమ్మెల్యే అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే గౌతు శిరీష మాట్లాడుతూ మెరుగైన వైద్య అవసరాలకు పేదరికం అడ్డు కాకూడదన్న ఆశయంతో ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు సీఎంఆర్ఎఫ్ నిధుల ద్వారా వేలాది కుటుంబాలను ఆదుకుంటున్నారన్నారు. ప్రజల ఆరోగ్య పరిరక్షణే కూటమి ప్రభుత్వ తొలి ప్రాధాన్యత అన్నారు. అనారోగ్య బారిన పడి ఆర్థికంగా చితికి పోయి కష్టాలలో వున్న కుటుంబాలకు సిఎంఆర్ఎఫ్ సహాయం కొండంత అండ నిలుస్తుందన్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలోనికి వచ్చినప్పటి నుంచి పలాస నియోజకవర్గంలో ముఖ్యమంత్రి సహాయనిధి చెక్కులు యిచ్చి ఆదుకున్నారన్నారు. ప్రజల ఆరోగ్య పరిరక్షణే కూటమి ప్రభుత్వ తొలి ప్రాధాన్యత అన్నారు. అనారోగ్య బారిన పడి ఆర్థికంగా చితికి పోయి కష్టాలలో వున్న కుటుంబాలకు సీఎంఆర్ఎఫ్ సహాయం కొండంత అండ నిలుస్తుందన్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలోనికి వచ్చినప్పటి నుంచి ముఖ్యమంత్రి సహాయనిధి చెక్కులు యిచ్చి ఆదుకున్నారన్నారు. ఈ కార్యక్రమంలో అరసవెల్లి ఉమామహేశ్వరరావు, తిమ్మల కృష్ణారావు, నెయ్యిల సూర్యనారాయణ, పాల్గొన్నారు.





## తేలుకుంచిలో పచ్చిరొట్ట విత్తనాల పంపిణీ

**ఇచ్ఛాపురం, మే 23 (వార్త):** తేలుకుంచి గ్రామంలో పచ్చిరొట్ట విత్తనాల పంపిణీ కార్యక్రమం నిర్వహించబడింది. రైతులకు జీలుగు మరియు జనుము పచ్చిరొట్ట విత్తనాలను సబ్సిడీపై పంపిణీ చేయడం జరిగింది. పచ్చిరొట్ట పంటలను సాగు చేయడం వలన భూమిలో సేంద్రీయ పదార్థం పెరిగి నేల సారవంతం అవుతుంది. అదేవిధంగా రసాయన ఎరువుల వినియోగం తగ్గి, నేల ఆరోగ్యం మెరుగుపడుతుంది అని రైతులకు అవగాహన కల్పించబడింది. ఈ సందర్భంగా రైతులకు ప్రభుత్వం ప్రాధాన్యతగా అమలు చేస్తున్న యాప్ పై నమోదు పై అవగాహన కార్యక్రమం నిర్వహించబడింది. ప్రతి రైతు తప్పనిసరిగా మొబైల్‌లో నమోదు చేసుకోవాలని, భవిష్యత్తులో వ్యవసాయ సేవలు, సబ్సిడీలు మరియు ప్రభుత్వ పథకాల అమలులో ఇది ఉపయోగపడుతుందని వివరించబడింది. అలాగే ఇచ్ఛాపురం మండలం పరిధిలోని 2 పురుగుమందుల దుకాణాలను తనిఖీ చేయడం జరిగింది. రాష్ట్ర ప్రభుత్వం విధించిన ఆదేశాల ప్రకారం డైక్లోరైడ్ 24 శాతం పురుగుమందు విక్రయాలను 60 రోజుల పాటు నిషేధించినందున, ఎవరైనా ఈ కాలంలో విక్రయాలు జరిపినట్లయితే చట్టపరమైన చర్యలు తీసుకుని శిక్షార్హులు అవుతారని డీలర్లకు హెచ్చరికలు జారీ చేయబడింది. స్టాక్ రిజిస్టర్లు, అమ్మకాల వివరాలు పరిశీలించబడినవి. ఈ కార్యక్రమంలో మండల వ్యవసాయ అధికారి అజయ్ కుమార్, దీక్షిత్, రైతులు సిబ్బంది పాల్గొన్నారు.

Printed and published and Owner by Chowdari Pramod Kumar , printed at Chowdari Printers, Near RTC complex, Arts colleage wall beside, Hodco colony,srikakulam-532001, AP.

Published at Near RTC complex, Arts colleage wall beside, Hodco colony, Srikakulam-532001. Editor: Chowdari Pramod Kumar, E-mail:jatheeyavaartha@gmail.com.cell. 9963063761, 9160000247, RNI/APTEL:2023/87546